Tazkare Sahabiyat
(Telugu)

ప్రవక్త ముహమ్మద్ (స)

కుమార్తెలు

మూలం
తాలిబ్ హాష్మి

అనువాదం
హుస్నా బతూల్ హుమైరవి

విషయసూచిక

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ముందుమాట

దేదీప్యమానమైన తన గత చరిత్రను మరిచి ఇతర జాతులను గుడ్డిగా అనుసరిస్తూ, తన జీవన వైఖరిని మార్చుకునే ఆ జాతి పతనం ప్రారంభమౌతుంది. నేడు ముస్లిం సమాజం అదే పరిస్థితికి లోనయింది. ఓవైపు పాశ్చాత్య సంస్కృతి, దాని బాహ్య సౌందర్యం, మరోవైపు ఇస్లామీయ సంస్కృతి దాని సచ్ఛీలత, లజ్జావ్రీడల బోధనలు. రెండింటిలో అవలంబించాల్సిన మార్గమేది. ఏది శ్రేయస్కరమనేదే అసలు ప్రశ్న.

ఇలా చెప్పటానికి కారణం, పాశ్చాత్య సంస్కృతిలో ఎలాంటి విశిష్టత లేదని కాదు, వాస్తవానికి పాశ్చాత్యులు మానవాళి సంక్షేమం కొరకు చేసిన ప్రయత్నాలు చాలా అభిలషణీయమైనవి. వారిలో ప్రపంచీకరణ పట్ల ఉన్న అపారమైన ప్రేమ, అనంతమైన సంకల్పం కూడా మెచ్చుకోదగినదే. కాని పాశ్చాత్యులను పెడమార్గాన పడవేస్తున్న అశ్లీలం, అసభ్యత, నీతి బాహ్యత, లైంగిక విశృంఖలత్వం, స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుత కలయికలు వంటి చెడుల నుంచి ముస్లిం సమాజాన్ని మేల్కొలపాలి. దాని భయంకర పరిణామాలను పాశ్చాత్యులు సైతం స్వయంగా అంగీకరిస్తున్నారు.

పాశ్చాత్య దేశాలలో, స్త్రీల జీవిత ఏకైక లక్ష్యం, కృత్రిమ అలంకరణలతో అందమైన బుట్ట బొమ్మలా తయారవ్వటమే.

పాశ్చాత్య స్త్రీ తన స్త్రీత్వాన్ని, స్త్రీ సహజ గుణాలను కోల్పోయింది. తన అంగాంగాలను ప్రదర్శిస్తూ, పురుషులను ఆహ్వానించే అంగడి వస్తువులా మారిపోయింది. బాహ్యపరమైన అందమే తప్ప, అంత రంగం మాత్రం అశ్లీలం, అరాచకాలతో నిండిపోయింది. ఇటువంటి అమానుష స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇస్లాం ఏవగించుకుంటుంది. దురదృష్టవశాత్తూ మన దేశంలోని కొన్ని వర్గాలు జీవితపు ప్రతి రంగంలో పాశ్చాత్యులను అనుసరించడం మనం చూస్తున్నాం. సైన్స్ అభివృద్ధి విషయంలో పశ్చిమ దేశాల అనుకరణ సమంజసమైనదే. కాని ముస్లిం సమాజ మహిళలు పాశ్చాత్య సంస్కృతిని అలవర్చు కుంటే ఇస్లాం స్ఫూర్తిని సాధించలేరు.

ముస్లిం మహిళలు తమ చరిత్రను గుర్తుచేసుకుంటూ, అందచందాలతో కూడిన కృత్రిమ జీవితానికి స్వస్తిపలికి, తమకంటూ ఓ జీవిత లక్ష్యం ఏర్పరచుకొని, ఇస్లాం చరిత్రలో ఆదర్శ మహిళలను తమ జీవితాలకు ఆదర్శంగా తీసుకునే సమయం ఆసన్నమైంది. ఇటు వంటి మాతృమూర్తులనే దివ్యఖుర్‌ఆన్ మోమినాత్, సాలెహాత్‌లంటూ పేర్కొన్నది.

ఈ పుస్తకం వుద్దేశ్యం, ముస్లిం మహిళలకు ఆదర్శ మహిళల జీవిత విశేషాల గురించి తెలియపరచటమే. వారి జీవన శైలిని అవలంబించినప్పుడే ఇహపర సాఫల్యాలు సొంతమవుతాయి.

1

హజ్రత్ జైనబ్ బిన్తె రసూలుల్లాహ్

హ|జత్ జైనబ్ (రజి), కారుణ్యమూర్తి దైవప్రవక్త వారి పెద్ద కుమార్తె. ఆమె తల్లి ఖదీజతుల్ కుబ్రా. జైనబ్ (రజి) దైవదౌత్యానికి ఏడేళ్లకు పూర్వం మక్కాలో జన్మించారు. దైవప్రవక్త వయస్సు అప్పుడు 30 సంవత్సరాలు.

హ|జత్ జైనబ్ (రజి) వివాహం బాల్యంలోనే తన పినతల్లి కొడుకు అబుల్ ఆస్‌తో జరిగింది. దైవప్రవక్తకు దైవదౌత్యం లభించిన వెంటనే జైనబ్ (రజి) ఇస్లాం స్వీకరించారు. అవిశ్వాసులు దైవ ప్రవక్తను, విశ్వసించిన వారిని హింసించడం మొదలుపెట్టారు. దైవ ప్రవక్త ఇద్దరు కుమార్తెలు రుఖియా, ఉమ్మె కుల్‌సుమ్‌ల వివాహం అబూలహబ్ కుమారులతో అయ్యింది. కానీ వీడ్కోలు జరగలేదు. అబూలహబ్ ఆజ్ఞప్రకారం వారిద్దరు ప్రవక్త కుమార్తెలకు విడాకు లిచ్చారు. అవిశ్వాసులు అబుల్ ఆస్‌ను కూడా జైనబ్‌కు విడాకు లిచ్చేందుకు పురిగొల్పారు. కాని ఆయన నిరాకరించారు. జైనబ్ పట్ల మంచి ప్రవర్తన కలిగి వున్నారు. దైవప్రవక్త అబుల్ ఆస్ ప్రవర్తనను మెచ్చుకునేవారు. గొప్ప వ్యక్తిత్వమయిన అబుల్ ఆస్ తన పూర్వికుల మతాన్ని వదల్లేదు. దైవప్రవక్త హి|జత్ చేసి మదీనా వెళ్లిపోయారు. జైనబ్ తన అత్తింట్లోనే వుండిపోయారు.

హిజ్రీ 2వ శకంలో రమజాన్ నెలలో సత్యాసత్యాల మధ్య మొదటిపోరు బద్ర్ మైదానంలో జరిగింది. అందులో సత్యం జయించింది. మక్కా ఖురైషీయులెంతో మంది ముస్లింల చేతుల్లో పట్టుపడ్డారు. వారిలో అబుల్ ఆస్ కూడా వున్నారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ వారిని బంధించారు. మక్కా వాసులకు ఆ విషయం తెలిసి, ఖైదీల బంధువులు తమవారి విడుదల కోసం దైవప్రవక్తకు పరిహార నగదును పంపారు. హజ్రత్ జైనబ్ (రజి) కూడా మక్కా నుండి తన మరిది అదుర్ బిన్ రబీ ద్వారా తన భర్త విడుదల కోసం ఓ హారం పంపారు. ఆ హారం జైనబ్‌కు ఆమె తల్లి పెళ్లి సందర్భంలో ఇచ్చారు. ఆ హారాన్ని దైవప్రవక్త సన్నిధిలో చేర్చగా ప్రవక్తకు ఖదీజా గుర్తుకొచ్చి కన్నీరుకార్చారు.

దైవప్రవక్త తన సహచరులతో ఇలా అన్నారు; మీరు సమంజసమని భావిస్తే ఆ హారం జైనబ్‌కు తిరిగి ఇచ్చేయండి. ఇది ఆమె తల్లి జ్ఞాపకం. అబుల్ ఆస్ పరిహారం ఏమంటే ఆయన మక్కా వెళ్లి జైనబ్‌ను వెంటనే మదీనా పంపించేయాలి. సహచరులంతా దైవప్రవక్త ఆజ్ఞను శిరసావహించారు. హజ్రత్ అబుల్ ఆస్ కూడా ఒప్పందాన్ని అంగీకరించారు. విడుదలై మక్కా వెళ్లారు. దైవప్రవక్త ఆయనతోపాటు జైద్ బిన్ హారిసాను పంపి "బతన్" ప్రదేశంలో నిరీక్షించి, జైనబ్ మక్కా నుండి అక్కడకు రాగానే ఆమెను తీసుకొని మదీనా రమ్మని చెప్పారు. హజ్రత్ అబుల్ ఆస్ వాగ్దానం ప్రకారం తన సోదరుడు కనానాపాటు జైనబ్‌ను మదీనాకు పంపారు. దైవప్రవక్త మదీనాకు పంపారు. దైవప్రవక్త కుమార్తె మదీనా వెళుతూందనే వార్త అవిశ్వాసులకు తెలిసి వారు కనానా, జైనబ్‌లను వెంటాడి 'జీతువా' ప్రాంతంలో ముట్టడిం

చారు. హజ్రత్ జైనబ్ ఒంటెపై వున్నారు. అవిశ్వాసుల వర్గంలోని ఓ వ్యక్తి హిబార్ బిన్ అస్వద్ జైనబ్‌ను నేలపై పడేశాడు. ఆమె గర్భవతిగా వున్నారు. బాగా దెబ్బతగిలి గర్భస్రావం జరిగింది. కనానా బిన్ రబీ కోపోద్రిక్తులై తన బాణాన్ని తీసి "జాగ్రత్త! ఇప్పుడు మీలో ఎవరైనా ముందుకొస్తే అతన్ని జల్లెడపడతాను" అంటూ కేకవేశారు. అవిశ్వాసులు ఆగిపోయారు. వారిలో అబూసుఫ్యాన్ కూడా వున్నారు. రబీ! నీ బాణాలను పక్కనపెట్టు, నేను నీకో మాట చెప్తాను విను అన్నారు. ఏమిటి మీరు చెప్పదలుచుకుంది? అడిగారు. అబూసుఫ్యాన్ కనానా చెవిలో మెల్లిగా చెప్పాడు. ముహమ్మద్ చేతుల్లో మేము ఎంత అవమానం పాలయ్యామో నీకు తెలియనిది కాదు కదా! ఆయన కుమార్తెను నీవు బహిరంగంగా అందరి ముందు తీసుకెళ్తే మాకు చులకనగా వుంటుంది. కనుక జైనబ్‌ను మక్కా తీసుకెళ్ళి ఏదో ఓ రోజు రహస్యంగా తీసుకెళ్ళు. కనానా ఆ మాటకు ఒప్పుకొని జైనబ్‌ను మక్కా తీసుకెళ్ళి పోయారు. కొన్ని రోజుల తరువాత రాత్రివేళ రహ స్యంగా జైనబ్‌ను తీసుకొని 'బతన్' ప్రాంతానికి చేరుకొని, అక్కడ ఆమెను జైద్ బిన్ హారిసాకు అప్పగించి మక్కా వెళ్లిపోయారు. జైద్ జైనబ్ (రజి)ను తీసుకొని మదీనా చేరుకున్నారు.

హజ్రత్ అబుల్ ఆస్ సత్య సంధులు, నీతిపరులు. ప్రజలు వారి దగ్గర తమ అప్పగింతలు పెడితే ఎంతో నీతి నిజాయితీలతో వాటిని భద్రపరిచేవారు. అడిగిన వెంటనే అప్పగించేవారు. మక్కాలో ఎంత పలుకుబడి గలవారంటే ప్రజలు తమ వ్యాపార సామాగ్రిని వారికి ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు పంపేవారు.

హిజ్రీ 6వ శకంలో అబుల్ ఆస్ ఒక వ్యాపార పటాలంతో సిరియా వెళుతుండగా "అయ్స్" అనే ప్రాంతంలో ముస్లిం వీర

యోధులు ఖురైష్ బిడారుపై దాడి చేశారు. మొత్తం ధన సామాగ్రిని ముట్టడించారు. అబుల్ ఆస్ మదీనాకు పారిపోయారు. ఇతర అవిశ్వాసులను ముస్లింలు బంధించారు. అబుల్ ఆస్ మదీనా చేరి జైనబ్ ఆశ్రయం పొందారు. దైవప్రవక్తతో తన సామాగ్రిని వాపసు ఇప్పించమని వేడుకున్నారు. అబుల్ ఆస్ మక్కాలో జైనబ్‌తో వ్యవహ రించిన తీరును దైవప్రవక్త చాలా మెచ్చుకునేవారు కనుక సహచరు లతో అబుల్ ఆస్ సామాగ్రిని మీరు వాపసు చేస్తే నేను కృతజ్ఞు డవుతాను అన్నారు.

సహచరులు ఎల్లప్పుడూ దైవప్రవక్త ప్రసన్నతనే కాంక్షించేవారు. కనుక వెంటనే మొత్తం ధన సామాగ్రిని అబుల్ ఆస్‌కు తిరిగి ఇచ్చే శారు. ఆస్ మొత్తం సామాగ్రి తీసుకొని మక్కా వెళ్లారు. ప్రజల అమానతులను అప్పగించారు. తరువాత మక్కావాసులనుద్దేశించి ఇలా అన్నారు.

"ఖురైష్ ప్రజలారా! మీలో ఇంకా ఎవరి అప్పగింతయినా నా వద్ద వుండిపోయిందా?"

మక్కా వాసులందరూ ముక్త కంఠంతో "'లేదు' దైవం మీకు మంచి ప్రతిఫలం ఇవ్వుగాక. మీరు సత్యసంధులు నిజాయితీపరులు" అన్నారు.

అయితే వినండి నేను ముస్లింనయ్యాను. దైవసాక్షి ఇస్లాం స్వీక రించేందుకు నేను వెనుకాడింది కేవలం మీరు నన్ను అవినీతిపరుడి నని అనుకుంటారేమోననే. ఆ తరువాత కలిమా పఠించారు. అక్కడి నుండి హిజ్రత్ చేసి మదీనా వెళ్లిపోయారు. హజ్రత్ జైనబ్, అబుల్ ఆస్‌లు షిర్క్ కారణంగా విడిపోయారు. కనుక అబుల్ ఆస్ ఇస్లామ్ స్వీకరించి మదీనా చేరుకున్నాక దైవప్రవక్త మళ్లీ ఇరువురి నికాహ్ జరిపి జైనబ్‌ను కాపురానికి పంపించారు.

ఆ తరువాత జైనబ్ ఎంతో కాలం జీవించలేదు. త్వరలోనే ఇహలోకాన్ని వీడారు. మొదటి సారి మక్కా నుండి వస్తున్నప్పుడు 'జీతుహ' ప్రాంతంలో గర్భస్రావం కారణంగా మరణించారు.

ఉమ్మె ఐమన్, హజ్రత్ సౌదా, ఉమ్మె సల్మా దైవప్రవక్త ఆజ్ఞ మేరకు జైనబ్ మృతదేహాన్ని గుసుల్ చేయించారు. దైవప్రవక్త ఉమ్మె అతియాతో ఇలా అన్నారు.

"ఉమ్మె అతియా నా కుమార్తెను కఫన్ (శవవస్త్రం)లో బాగా కట్టండి. ఆమె వెంట్రుకలకు మూడు జడలు వేయండి. సుగంధ ద్రవ్యాలను బాగా పూయండి."

దైవప్రవక్త స్వయంగా జనాజా నమాజ్ చేయించారు. అబుల్ ఆస్ (రజి) సమాధిలో దించారు. ఓ ఉల్లేఖనంలో దైవప్రవక్త స్వయంగా సమాధిలో దిగారని వున్నది.

జైనబ్ చనిపోయిన రోజు దైవప్రవక్త చాలా దుఖించారు. కళ్ల నుండి అశ్రుధారలు కారసాగాయి.

జైనబ్ నా కుమార్తెలందరిలో చాలా గొప్ప కుమార్తె. నా ప్రేమ కోసం ఎన్నో కష్టాలనుభవించింది అనేవారు.

హజ్రత్ జైనబ్‌కు అలీబిన్ అబుల్ ఆస్, ఉమామా (రజి) ఇద్దరు సంతానం. ఓ ఉల్లేఖనం ప్రకారం అలీ యర్‌మూక్ యుద్ధంలో అమరగతులయ్యారు.

కొన్ని రోజుల తరువాత అబుల్ ఆస్ కూడా మృతి చెందారు. మరణించేముందు ఆయన తన కుమార్తె ఉమామా (రజి) జుబైర్ సూచన మేరకు హజ్రత్ అలీ (రజి)ని వివాహ మాడారు.

2

హజ్రత్ రుఖియా బిన్తె రసూలుల్లాహ్

హజ్రత్ రుఖియా (రజి), దైవప్రవక్త, ఖదీజతుల్ కుబ్రాల ద్వితీయ కుమార్తె. దైవదౌత్యానికి ఏడేళ్ల ముందు జన్మించారు. మహనీయుల వయస్సు అప్పుడు 33 సంవత్సరాలు. హజ్రత్ రుఖియా జైనబ్ కన్నా 3ఏళ్ల చిన్నవారు.

ఆమె మొదటి వివాహం తన పినతండ్రి కొడుకు ఉత్బా బిన్ అబూలహబ్‌తో జరిగింది. 'సూరెలహబ్' అవతరించినప్పుడు ఉత్బా తన తండ్రి ఆజ్ఞానుసారం రుఖియాకు విడాకులిచ్చాడు. అప్పటికీ ఇంకా ఆమె వీడ్కోలు జరగలేదు.

కొన్ని రోజుల తరువాత ఉస్మాన్ బిన్ అప్ఫాన్ ఇస్లాం స్వీకరించారు. అత్యంత ధనికులు, సత్యసంధుడైన యువకుడు గనుక ఉస్మాన్‌ని దైవప్రవక్త తన అల్లుడిగా ఎంచుకున్నారు. హజ్రత్ ఉస్మాన్ కూడా మనస్ఫూర్తిగా అదే కోరుకున్నారు. మక్కాలోనే రుఖియా వివాహం ఉస్మాన్‌తో జరిపారు.

మక్కాలో అవిశ్వాసులు ముస్లింలను విపరీతమైన హింసలకు గురి చేస్తుండగా దైవప్రవక్త వారిని ఆఫ్రికా హిజ్రత్ చేసేందుకు అనుమతించారు. హజ్రత్ ఉస్మాన్ కూడా రుఖియాతో పాటు హిజ్రత్ చేసి అక్కడికి వెళ్లిపోయారు. ఆ విషయం దైవప్రవక్తకు తెలిసి "ఇబ్రాహీం, లూత్ (అలై) తరువాత సతీసమేతంగా దైవమార్గంలో

హిజ్రత్ చేసిన మొట్టమొదట వ్యక్తిగా ఉస్మాన్ (రజి) నిలిచారు.

కొంతకాలం తరువాత ఇద్దరూ తిరిగి మక్కా చేరుకున్నారు; కాని అవిశ్వాసుల ఆగడాలు మునుపటి కన్నా మరింత తీవ్రతరమవడంతో మళ్లీ ఆఫ్రికా వెళ్లిపోయారు. చాలా రోజుల దాకా వారి క్షేమ సమాచారాలు తెలియకపోవడంతో దైవప్రవక్త దిగ్భ్రాంతి చెందారు. ఓ రోజు ఓ స్త్రీ వచ్చి నేను ఉస్మాన్, రుఖియాలను ఆఫ్రికాలో క్షేమంగా వున్నట్లు చూశానని సమాచారమిచ్చింది. అప్పుడు దైవప్రవక్తకు మనశ్శాంతి కలిగింది.

చాలాకాలం తరువాత హజ్రత్ ఉస్మాన్‌కు దైవప్రవక్త మదీనాకు హజ్రత్ చేస్తున్నారనే విషయం తెలిసి ఇతర ముస్లింలతోపాటు వారిద్దరూ మక్కాకు తిరిగి వచ్చి, దైవప్రవక్తతోపాటు మదీనా వెళ్లిపోయారు.

హిజ్రీ 2వ శకంలో హజ్రత్ రుఖియాకు స్ఫోటకము వచ్చింది. అప్పుడు దైవప్రవక్త బద్ర్ వెళ్లేందుకు సిద్ధమౌతున్నారు. ప్రయాణానికి ముందు హజ్రత్ ఉస్మాన్‌కు రుఖియా యోగక్షేమాలు చూసుకునేందుకు మదీనాలోనే వుండమని ఆజ్ఞాపించారు. దైవం దానికి బదులుగా జిహాద్‌లో పాల్గొనేంత పుణ్యఫలం ప్రసాదిస్తాడని, యుద్ధ సంపదలో కూడా వాటా వుంటుందని నచ్చచెప్పారు. కనుక ఉస్మాన్ రుఖియా దగ్గరే వుండిపోయారు. దైవప్రవక్త బదర్‌లో వుండగానే రుఖియా వ్యాధి తీవ్రమై తన 21వ ఏట ఇహలోకాన్ని వీడారు. రుఖియా సమాధిపై మట్టి వేస్తుండగా హజ్రత్ జైద్ బిన్ హారిసా ముస్లింల విజయవార్తను తీసుకొని మదీనా చేరుకున్నారు. కారుణ్యమూర్తి (సఅసం) తన ముద్దుల కుమార్తె మరణవార్త విని చాలా దుఃఖించారు. మదీనా

తిరిగివచ్చి రుఖియా సమాధి వద్దకు వెళ్లారు. ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ వెళ్లిపోయారు. ఇక నీవు కూడా ఆయన్ని కలుసుకో అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. (ముహాజిర్లు మదీనా వచ్చి మరణించిన వారిలో ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మొదటి వ్యక్తి) దైవప్రవక్త మాటలు విని అక్కడున్న మహిళలు రోదించడం మొదలెట్టారు. హజ్రత్ ఉస్మాన్ వారిని వారించబోతే, ఉమర్, వారిని ఏడ్వనివ్వండి, హృదయ నయనాలు రోదించడంలో తప్పులేదు అన్నారు దైవప్రవక్త.

హజ్రత్ ఫాతిమా కూడా తన అక్క సమాధి వద్దకు వచ్చి సమాధి పక్కనే కూర్చొని ఏడుస్తుండటంతో దైవప్రవక్త తన పవిత్ర దుప్పటితో ఆమె కన్నీరును తుడిచి ఓదార్చారు.

హజ్రత్ రుఖియా ఆఫ్రికాలో వున్నప్పుడు ఆమెకు మగ సంతానం అబ్దుల్లా కలిగారు. అబ్దుల్లా ఆరేళ్ల ప్రాయంలో ఉన్నప్పుడు కోడిపుంజు కళ్లల్లో పొడవడంతో ముఖమంతా వాచిపోయి, అదే బాధలో హిజ్రీ 4వ శకంలో మరణించారు. దైవప్రవక్త జనాజా నమాజ్ చేయించారు. ఉస్మాన్ (రజి) సమాధిలో దించారు.

హజ్రత్ ఉస్మాన్, రుఖియా (రజి)లు పరస్పరం ప్రేమానురాగాలతో మసలుకునేవారు. వారి అన్యోన్య దాంపత్యాన్ని చూసి అందరూ మురిసి పోయేవారు.

3

హజ్రత్ ఉమ్మె కుల్సుమ్ బిన్తె రసూలుల్లాహ్

ఉమ్మె కుల్సుమ్ మహనీయ ముహమ్మద్ (స) మూడవ కుమార్తె. ఆమె దైవదౌత్యానికి ముందు పుట్టారు. ఆమె వివాహం తన పిన తండ్రి కొడుకు ఉతైబా బిన్ అబూలహబ్‌తో జరిగింది. దైవ ప్రవక్తకు దైవదౌత్యం లభించి, ఇస్లాం ధర్మప్రచారం చేయనారంభించి నప్పుడు అబూలహబ్, ఆమె భార్య ప్రవక్తకు బద్ధ శత్రువులయ్యారు. దైవప్రవక్తను హింసించడంలో ప్రముఖ పాత్ర వహించారు. అప్పుడే సూరె లహబ్ అవతరించింది. అబూలహబ్ కోపం కట్టలు తెంచు కుంది. కుమారుడు ఉత్బా వివాహంలో రుఖియా, మరో కుమారుడు ఉతైబా వివాహంలో ఉమ్మె కుల్సుమ్ వున్నారు. అబూలహబ్ తన ఇద్దరు కుమారుల్ని పిలిచి ఇలా ఉపదేశించారు; "మీరు ముహమ్మద్ కుమార్తెలకు విడాకులివ్వకపోతే నాతోపాటు ఉండే అర్హత మీకు లేదు"

ఇద్దరు పుత్రులు, దుర్మార్గుడైన తండ్రి ఆజ్ఞను శిరసావహిస్తూ ఉత్బా రుఖియాకు, ఉతైబా ఉమ్మె కుల్సుమ్‌కు విడాకులిచ్చారు.

విడాకులు పొందిన తరువాత హజ్రత్ రుఖియా ఉస్మాన్‌ను వివాహమాడారు. వివాహమైన కొన్నేళ్లకే ఆమె మరణించారు. ఆమె మరణంతో ఉస్మాన్ చాలా దుఃఖితులయ్యారు. ఆ రోజుల్లోనే ఉమర్

(రజి) కుమార్తె హఫ్సా వితంతువయ్యారు. ఆయన తన కుమార్తె హఫ్సాను చేసుకోమని ఉస్మాన్‌ను కోరారు. కానీ ఉస్మాన్ నిరాకరించారు. దైవప్రవక్తకు తెలిసి ఉమర్‌తో ఇలా అన్నారు; నేను హఫ్సా కోసం ఉస్మాన్ కన్నా ఉత్తమ వ్యక్తి సంబంధం చెప్తాను, ఉస్మాన్ కోసం హఫ్సా కన్నా ఉత్తమ సంబంధం చూపిస్తాను. హఫ్సా నికాహ్ నాతో జరిపించండి. నా కుమార్తె ఉమ్మె కుల్సుమ్ వివాహం ఉస్మాన్‌తో జరిపిస్తాను. హజ్రత్ ఉమర్ వెంటనే అంగీకరించారు. కనుక హఫ్సా నికాహ్ దైవప్రవక్తతో జరిగింది. ఉమ్మె కుల్సుమ్ నికాహ్ ఉస్మాన్‌తో జరిపించారు.

హజ్రత్ ఉమ్మె కుల్సుమ్ ఈ వివాహం తరువాత ఆరేళ్లు జీవించారు. హిజ్రీ 9వ శకంలో షాబాన్ నెలలో మరణించారు. హజ్రత్ సఫియా బిన్తె అబ్దుల్ ముత్తలిబ్, ఉమ్మె అతియా, అస్మా బిన్తె ఉమైస్ దైవప్రవక్త ఆజ్ఞానుసారం గుసుల్ చేయించారు. కఫన్ కోసం దైవ ప్రవక్త తన దుప్పటినిచ్చారు. స్వయంగా జనాజా నమాజ్ చేయించారు. హజ్రత్ అలీ, అబూ తల్హా, ఉసామా బిన్ జైద్, ఫజల్ బిన్ అబ్బాస్ (రజి) సమాధిలో దిగారు. జన్నతుల్ బఖీలో ఖననం చేశారు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ఉమ్మె కుల్సుమ్‌ను సమాధిలో దించినప్పుడు దైవప్రవక్త అక్కడే వున్నారు. ఆయన కళ్లలో కన్నీటి ధారలు కారసాగాయి. ఉమ్మె కుల్సుమ్(రజి)కు సంతానం కలగలేదు.

4

హజ్రత్ ఫాతిమా (రజి) బిన్తె రసూల్

హజ్రత్ ఫాతిమా దైవప్రవక్త, ఖదీజతుల్ కుబ్రాల నాలుగవ కుమార్తె. చివరి సంతానం. బతూల్, తాహిరా, ముతహ్హారు, రఆజియా, మర్జియా, జాకియా ఆమె బిరుదులు.

హజ్రత్ ఫాతిమా (రజి) దైవదౌత్యానికి ఏడేళ్లు పూర్వం జన్మించారు. బాల్యం నుంచే నిర్మల మనస్కురాలు, ఏకాంతప్రియులు. ఇంటి నుండి బయట అడుగుపెట్టడం కాని, ఎలాంటి ఆటలు కాని ఆడేవారు కాదు. ఎల్లప్పుడూ తల్లి వెంటే వుండేవారు. తల్లి ఖదీజా తండ్రి దైవప్రవక్తతో అడిగే ప్రశ్నలతో ఆమె మేధాశక్తి, తెలివితేటలు తేటతెల్లమయ్యేవి. ప్రదర్శనా బుద్ధిని ఎంతో ఏవగించుకునేవారు. ప్రాపంచిక వ్యామోహంతో వ్యాకులత చెందేవారు.

ఒకసారి ఖదీజా బంధువులలో పెళ్లి వుండగా ఆమె ఫాతిమా కోసం ఖరీదైన బట్టలు, నగలను కొన్నారు. కాని ఫాతిమా వాటిని వేసుకునేందుకు నిరాకరించారు. ఎంతో నిరాడంబరంగా పెళ్ళిలో పాల్గొన్నారు. అంటే బాల్యం నుంచే ఆమె ప్రవర్తనలో దైవభీతి, నిరాడంబరత ఉట్టిపడేవి.

హజ్రత్ ఖదీజా, ఫాతిమా విద్యా శిక్షణలు గరపడంలో చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఒకసారి ఆమె ఫాతిమాకు పాఠాలు నేర్పుతుండగా చిన్నారి ఫాతిమా (రజి) ఇలా అడిగింది;

"అమ్మా! మనం దైవానుగ్రహాలను ఎప్పుడూ చూస్తూనే

వుంటాం కాని దేవుడే నేరుగా ఎందుకు కానరాడు." హజ్రత్ ఖదీజా అన్నారు "చిట్టితల్లీ! మనం ప్రపంచంలో మంచి కార్యాలు చేసి దైవాజ్ఞలకు శిరసావహిస్తే ప్రళయ దినాన దేవుని ప్రసన్నతకు అర్హులవుతాము. అప్పుడే దైవదర్శనం లభిస్తుంది."

దైవదౌత్యపు పదవ ఏట ఖదీజా (రజి) పరమపదించడంతో ఫాతిమా దుఖసాగరంలో మునిగిపోయారు. ప్రవక్త ఫాతిమా శిక్షణ, సంరక్షణ కోసం సౌదాను నికాహ్ చేసుకున్నారు. దైవప్రవక్త జీవితమంతా ధర్మ ప్రచారానికే అంకితమయ్యేది. అప్పుడప్పుడు తీరిక దొరికినప్పుడు ఫాతిమా వద్దకెళ్ళి ఓదార్చుతూ అమూల్యమైన హితోపదేశాలు చేస్తూ వుండేవారు. ఏకాంత సమయాల్లో హఫ్సా (రజి), ఆయిషా (రజి), అస్మా బిన్తె అబూబకర్, ఫాతిమా బిన్తె జుబైర్ తదితరులు ఫాతిమా వద్దకు వచ్చి ఆమెను ఓదార్చేవారు. ధర్మప్రచారం చేసినందుకు అవిశ్వాసులు దైవప్రవక్తను ఎన్నో బాధలు పెట్టేవారు. ప్రవక్త పవిత్ర శిరస్సుపై మట్టివేయడం, దారిలో ముళ్ళుపరచడం లాంటి హింసలకు గురిచేసేవారు. దైవప్రవక్త ఇంటికి చేరుకోగానే ఫాతిమా, తండ్రి ఆపదలపై అశ్రుధారలు కార్చేవారు. అప్పుడు దైవప్రవక్త ఓదార్చుతూ "చిట్టితల్లి! అధైర్యపడకు, దైవం నీ తండ్రిని ఒంటరిగా వదలడు అనేవారు."

ఓ సారి దైవప్రవక్త కాబా గృహంలో నమాజ్ చేస్తుండగా అవిశ్వాసులకు దురాలోచన తట్టింది. వారు ఒంటె పేగులను తెచ్చి సజ్దా చేస్తుండగా ప్రవక్త మెడపై వేశారు. ఎవరో ఫాతిమా వద్దకు వచ్చి నీ తండ్రి ముహమ్మద్ (సఅసం)పై దుష్టులు దుశ్చేష్టలకు పాల్ప డ్డారని చెప్పారు. ఆమె కలతచెంది వెంటనే పరుగెత్తుకుంటూ కాబాకు వెళ్లి దైవప్రవక్త మెడపై నుంచి అపరిశుభ్రతను తొలగించారు. అవిశ్వా

సులు అక్కడే నిలబడి నవ్వుతూ చప్పట్లు కొడుతుండగా కారుణ్యమూర్తి కుమార్తె గంభీరంగా వారివైపు దృష్టిసారించి, "ఓ దుష్టులారా! దైవం మిమ్మల్ని మీ దుష్కార్యాలకు బదులు తప్పకుండా శిక్షిస్తాడు" అంటూ శపించారు. కొన్నేళ్ల తరువాత వారు దైవాగ్రహానికి గురయ్యారు. బద్ర్ యుద్ధంలో పరాభవం పాలై అత్యంత అవమానకర స్థితిలో అంతమయ్యారు.

మక్కా అవిశ్వాసుల ఆగడాలు ఆకతాయితనం మరింత అధికమవడంతో దైవప్రవక్తకు హిజ్రత్ చేసే దైవాజ్ఞ కలిగింది. దైవదౌత్యపు 13వ ఏట ఓ రాత్రి హజ్రత్ అలీ (రజి)ని తన దుప్పటిపై పడుకోబెట్టి ప్రవక్త (సఅసం) అబూబకర్ (రజి)తోపాటు మదీనా పయనమయ్యారు. కొన్ని రోజుల తరువాత తన కుటుంబీకులను తీసుకురావడానికి స్వంత సేవకుడు అబూరాఫే, జైద్ బిన్ హారిసా (రజి)ను మక్కా పంపారు. వారిరువురి వెంట ఫాతిమా, ఉమ్మె కుల్సుమ్ (రజి), సౌదా (రజి), హజ్రత్ ఉమ్మె అయ్యాన్ (రజి), ఉసామా బిన్ జైద్ (రజి) మదీనా వెళ్లారు. హజ్రత్ సౌదా (రజి) దైవప్రవక్త కుమార్తెలు ప్రవక్తతో పాటు తమ స్వంత గృహాలలో బసచేశారు.

మదీనా హిజ్రత్ చేసే సమయానికి ఫాతిమా (రజి) యుక్త వయస్సుకు చేరుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్తకు ఫాతిమా కోసం పెళ్లి సంబంధం పంపారు. కాని ప్రవక్త మిన్నకుండిపోయారు. దైవాజ్ఞ ఎలా అయితే అలా జరుగుతుంది అన్నారు. తరువాత ఉమర్ (రజి) కూడా సంబంధం పంపారు. వారికీ అదే విధంగా జవాబిచ్చారు. కొన్ని రోజుల తరువాత దైవప్రవక్త ఫాతిమా (రజి) సంబంధం అలీ (రజి)తో నిశ్చయించారు. ఈ సంబంధం గురించి విభిన్న ఉల్లేఖనాలు ఉన్నాయి.

ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అలీ (రజి) స్వతంత్ర సేవకులు. ఒకరోజు వారితో దైవప్రవక్తకు ఎవరైనా ఫాతిమా సంబంధం పంపారా అనడిగారు. దానికి నాకు తెలియదు అని జవాబిచ్చారు. మరి మీ సంబంధం ఎందుకు పంపరని ప్రశ్నించగా నా వద్ద పెళ్ళి చేసుకోడానికి ఏముందని పంపను అన్నారు. ఆ సజ్జనురాలు తన ఒత్తిడితో హజ్రత్ అలీ (రజి)ని దైవప్రవక్త వద్దకు పంపారు. హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త వద్దకు వెళ్లారు. సిగ్గు, బిడియాలతో ఏమి చెప్పలేక తలవంచుకొని మౌనంగా కూర్చున్నారు. దైవప్రవక్త నేరుగా దృష్టి సారించి "అలీ ఏమిటీ? ఈవేళ అసాధార ణంగా మౌనంగా వున్నావు ఫాతిమాతో పెళ్లి సంబంధం కాని ఏమైనా తీసుకొచ్చావా" అని అడిగారు. 'అవును' దైవప్రవక్తా! అన్నారు. అయితే నీ వద్ద మహర్ ఇచ్చేందుకు ఏమైనా వుందా అనడిగారు. హజ్రత్ అలీ (రజి) 'లేదు' అని జవాబిచ్చారు. అయితే నేను నీకు ఇచ్చిన కవచములనే మహర్‌గా ఇవ్వు, అన్నారు. హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త ఉపదేశాన్ని అంగీకరించి తన వద్ద వున్న కవచాన్ని అమ్మేందుకు బజారుకెళ్లారు. దారిలో హజ్రత్ ఉస్మాన్ (రజి) కలిశారు. ఆయన నాలుగు వందలు దిర్హమ్‌లలో ఆ కవచాన్ని కొన్నారు. అదే కవచాన్ని అలీకి కానుకగా తిరిగి ఇచ్చారు. హజ్రత్ అలీ (రజి) ఆ నగదును దైవప్రవక్తకు ఇవ్వగా ప్రవక్త ఇలా అన్నారు, మూడింతల రెండు వంతులు సుగంధ ద్రవ్యాల కోసం ఖర్చుచెయ్యండి. మూడవ వంతు పెళ్లి సామానులు, ఇతర గృహోపకరణాలు తెచ్చుకోండి. అనస్ (రజి)ను, వెళ్లి అబూబకర్, ఉమర్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఇతర ముహాజిర్లు, అన్సార్‌లను పిలుచుకు రమ్మని ఆజ్ఞాపించారు. అందరూ రాగానే ప్రవక్త (సఅసం) వేదికపైకెళ్లి నికాహ్ ప్రసంగం చదివారు. హజ్రత్ అలీ (రజి)ని చూసి చిరునవ్వుతో ఇలా అన్నారు. "నాలుగు వందల తులాల వెండి,

మహర్‌పై ఫాతిమాను నీ నికాహ్‌లో ఇచ్చాను. నీకు సమ్మతమేనా?" హ(జత్ అలీ (రజి) సంతోషంగా సమ్మతమే అని జవాబిచ్చారు. తరువాత దైవ(ప్రవక్త దైవం మీకు శుభాలు కలుగజేయాలని, మీద్వారా పవిత్ర సంతానం కలగాలని (ప్రార్థించారు. ఒక పళ్లెము ఖర్జూరాలను అక్కడున్న వారికి పంచారు. వివాహ సమయంలో ఫాతిమా వయస్సు దాదాపు 15 ఏళ్లు. హ(జత్ అలీ (రజి) వయస్సు 21 సంవత్సరాలు. హ(జత్ అలీ (రజి) దైవ(ప్రవక్త (సఅసం) నివాసానికి కొంతదూరంలో ఓ ఇంటిని అద్దెకు తీసు కున్నారు. ఫాతిమా వీడ్కోలు జరిగిన తరువాత అదే ఇంటి ఇల్లాల య్యారు. వీడ్కోలుకు ముందు దైవ(ప్రవక్త (సఅసం) అలీ (రజి)ని పిలిచారు. తన పవిత్ర హృదయ ఫలకంపై ఆయన శిరము నుంచి నుదుటిపై ముద్దాడారు. తన కుమార్తె చేయిని అలీ (రజి) చేతిలో పెట్టి "ఓ అలీ! (ప్రవక్త కుమార్తె నీకు శుభం కలుగు గాక" అన్నారు. తరువాత ఫాతిమానుద్దేశించి 'నీ భర్త చాలా మంచి వాడు' అన్నారు. (ప్రవక్త (సఅసం) భార్యాభర్తలిరువురి హక్కులు, విధు లను తెలియ జేశారు. గడప దాకా వెళ్లి వీడ్కోలు పలికారు. హ(జత్ అలీ (రజి) ఫాతిమా (రజి) ఇద్దరూ ఒంటెపై కూర్చున్నారు. సల్మాన్ ఫార్సీ (రజి) కళ్లాన్ని పట్టుకున్నారు. కొన్ని ఉల్లేఖనాల (ప్రకారం అస్మా బిన్తె ఉమైస్ (రజి), సల్మా (రజి), ఉమ్మె అయ్యాన్ (రజి) వారితోపాటు వెళ్లారు.

దైవప్రవక్త తన కుమార్తెకిచ్చిన గృహోపకరణాలు

1. ఉన్నితో నిండిన ఈజిప్టు దుప్పటి 2. మంచం, 3. ఖర్జూరపు తోలుతో నిండిన దిండు 4. తోలుతిత్తి, 5. మట్టికుండలు (నీటికోసం) 6. తిరుగలి 7. పాత్ర 8. రెండు దుప్పట్లు 9. రెండు వెండి భుజ బంధములు, 10. జానిమాజ్

వివాహం తరువాత దైవప్రవక్త (సఅసం) అలీ (రజి)తో వలీమా విందు వుండాలన్నారు. మహర్ ఇచ్చిన తరువాత మిగిలిన నగదుతోనే వలీమా విందు ఏర్పాటు చేశారు. విందులో పన్నీరు ఖర్జూ రాలు, జొన్నరొట్టె, మాంసము పెట్టారు. అస్మా ఉల్లేఖనం ప్రకారం 'అది ఆ రోజుల్లో అత్యున్నత విందుగా భావించబడేది. .

ఫాతిమా నూతన గృహానికి వెళ్లిన తరువాత దైవప్రవక్త(సఅసం) ఆమె వద్దకు వెళ్ళారు. గడపమీద నిలబడి అనుమతి కోరుతూ లోపల ప్రవేశించారు. ఒక గిన్నెలో నీరు తెప్పించారు. తన స్వహస్తాలతో హజ్రత్ అలీ (రజి) హృదయంపై నీరు చల్లారు. తరువాత ఫాతిమాను పిలిచారు. సిగ్గు, బిడియాలతో సంకోచిస్తూ తండ్రి వద్దకు వచ్చారు. ప్రవక్త ఆమెపై కూడా నీరు చల్లారు.

ఫాతిమా, నేను నీ వివాహం నా కుటుంబీకుల్లో ఉన్నత వ్యక్తితో చేశాను అన్నారు.

ఫాతిమా నివాసం దైవప్రవక్త నివాసానికి కొంత దూరంలో వుండేది. దీంతో ప్రవక్త (సఅసం)కు రాకపోకలకు ఇబ్బంది కలిగేది. దైవప్రవక్త ఫాతిమా (రజి)తో అన్నారు "చిట్టితల్లీ! నేను తరచూ నిన్ను చూడటానికి రావాల్సి వస్తుంది. నేను నిన్ను నా వద్దకు రప్పించు కోవాలనుకుంటున్నాను."

దానికి ఫాతిమా "మీ పొరుగున హారిసా బిన్ నోమాన్ (రజి) గృహాలు చాలా ఉన్నాయి. మీరు వారితో చెప్పండి ఏదో ఒక ఇల్లు ఖాళీ చేసి ఇస్తారు" అన్నారు.

హారిసా బిన్ నోమాన్ (రజి) ఓ ధనిక అన్సారి. వారికి చాలా గృహాలున్నాయి. దైవప్రవక్త మదీనాకు వచ్చిన తరువాత అవన్నీ ఒక దాని తరువాత మరొకటి దైవప్రవక్తకు సమర్పించారు. ఫాతిమా

హారిసా ఇంటి కొరకు విన్నవించుకోగా ప్రవక్త ఫాతిమాతో "అమ్మా! హారిసాను అడగటానికి నాకు సిగ్గేస్తుంది, ఎందుకంటే హారిసా ఇప్పటికే ఎన్నో గృహాలు దైవం, దైవప్రవక్త ప్రసన్నతల కోసం దైవ మార్గంలో ఇచ్చేశారు" అన్నారు. ఫాతిమా మిన్నకుండిపోయారు.

ప్రవక్త తన కుమార్తెను తన దగ్గరకు రప్పించుకోవాలను కుంటున్నారని కాని ఇల్లుదొరకటం లేదనే వార్త ఆనోటా ఈనోటా హారిసాకు చేరింది. వారు వెంటనే ప్రవక్త సఅసం) వద్దకు వచ్చి "ప్రవక్తా! మీరు పిలుచుకోదలిస్తే మీపక్కనే వున్న ఇంటిని ఖాళీ చేస్తాను. ఫాతిమాను పిలవండి దైవసాక్షి! ఏ వస్తువునయితే ప్రవక్త నా వద్ద నుండి తీసుకున్నారో అది నా కన్నా ప్రవక్త వద్ద వుండడమే నా కిష్టం, అన్నారు. తరువాత ప్రవక్త (సఅసం) అలీ (రజి) ఫాతిమా (రజి)ల నివాసాలను హారిసా బిన్ నోమాన్ ఇంటికి మార్చారు.

హజ్రత్ ఫాతిమా సంభాషణా మర్యాదలు అలవాట్లలో దైవ ప్రవక్త (సఅసం) ఆదర్శాలు ఉట్టిపడేవి. ఆమె దైవభీతి, ధర్మపరా యణత, సహనస్థయిర్యాలు గల మహిళ. ఇంటి పనులంతా స్వయంగా ఆమే చక్కబెట్టేవారు. తిరుగలి తిప్పుతూ చేతుల్లో బొప్పలు వచ్చేవి. పొయ్యి రాజుతూ, ఇల్లు చిమ్ముతూ బట్టలు మాసిపోయేవి. ఇంటి పనులే కాకుండా దైవారాధన కూడా అధికంగా చేసేవారు. తండ్రి అరబ్ దేశ మహారాజు, విశ్వకారుణ్యమూర్తి కుమార్తె, అల్లుడు ఎన్నెన్నో రోజులు పస్తులు ఉండేవారు. ఓ సారి భార్యభర్తలు నాలుగు రోజులు పస్తులున్నారు. హజ్రత్ అలీ (రజి) కూలీ చేసి ఒక దిర్హమ్ సంపాదించారు. పొద్దుపోయాక ఆ ఒక్క దిర్హంతో ఎక్కడి నుంచో జొన్నలు తెచ్చారు. హజ్రత్ ఫాతిమా (రజి) ఎంతో సంతోషంగా భర్తను స్వాగతించారు. జొన్నలు తీసుకొని తిరుగలిలో వేసి పిండి

కొట్టారు. రొట్టె చేసి హజ్రత్ అలీ (రజి) ముందు పెట్టారు. ఆయన తిన్న తరువాత ఆమె కూర్చున్నారు. అప్పుడు ఫాతిమా ప్రపంచంలో అత్యున్నత మహిళ అన్న దైవప్రవక్త ఉపదేశం గుర్తు కొచ్చింది అన్నారు హజ్రత్ అలీ (రజి).

ఆ రోజుల్లో ఇస్లాం ధర్మం దినదిన ప్రవర్థమానంగా విస్తరించ సాగింది. మదీనాలో యుద్ధ సంపద అధికంగా రావడం మొదల యింది. ఓ రోజు యుద్ధ సంపదలో కొంతమంది బానిసలొచ్చారని తెలిసింది. హజ్రత్ అలీ (రజి) ఫాతిమాతో అన్నారు. ఫాతిమా! తిరుగలి తిప్పుతూ తిప్పుతూ నీ చేతుల్లో బొబ్బలొచ్చాయి. పొయ్యి రాజేస్తూ ముఖవర్చస్సు మారిపోయింది. దైవప్రవక్త వద్దకు యుద్ధ సంపదలో చాలా మంది బానిసలొచ్చారు. వెళ్లి ఓ బానిసను అడిగి తెచ్చుకో అన్నారు. హజ్రత్ ఫాతిమా (రజి) దైవప్రవక్త వద్దకు వెళ్లారు. కాని సిగ్గు, బిడియంతో ఏమీ మాట్లాడలేకపోయారు. కొద్దిసేపుండి తిరిగి వచ్చేశారు. హజ్రత్ అలీ (రజి)తో, నాకు బానిసను అడిగేంత ధైర్యం లేదు. తరువాత భార్యాభర్తలిరువురూ దైవప్రవక్త సన్నిధికి వెళ్లి తమ బాధలను చెప్పుకున్నారు. బానిసనివ్వమని అడిగారు. అందుకు ప్రవక్త, "నేను మీ సేవ కొరకు ఏ ఖైదీని ఇవ్వలేను, సుఫ్ఫా అనుచరుల అన్నపానియాల ఏర్పాట్లు చెయ్యాలి. తమ ఇల్లు, వాకిలిని వదిలి దైవ ప్రసన్నత కొరకు పస్తులున్న వారిని ఎలా మరువను" అన్నారు. దంపలిరువురూ మౌనంగా ఇంటికి తిరిగి వచ్చేశారు.

ఇబ్నెసాద్, హాఫిజ్ ఇబ్నె హజర్ కథనం ప్రకారం దైవప్రవక్త రాత్రివేళ వారివద్దకెళ్లి ఇలా అన్నారు. మీరు కోరుకున్న దానికన్నా ఉ త్తమ మార్గం చెప్తాను. ప్రతి నమాజు తరువాత పదిసార్లు సుబ్హా నల్లాహ్, అల్హందులిల్లాహ్, అల్లాహు అక్బర్ స్మరించండి. నిద్రకు

ఉపక్రమించినప్పుడు సుబ్‌హానల్లాహ్, అల్‌హందులిల్లాహ్ 33సార్లు, అల్లాహుఅక్బర్ 34 సార్లు స్మరించండి. ఈ ఆచరణ మీ కొరకు ఉత్తమ సేవకుడితో సమానం.

ఒకసారి దైవప్రవక్త ఫాతిమా వద్దకు వచ్చినప్పుడు ఆమె ఒంటె తోలుతో చేసిన బట్టలు తొడుక్కొని వున్నారు. అందులో కూడా పదమూడు అతుకులున్నాయి. పిండి కలుపుతూ దైవనామస్మరణ చేస్తున్నారు. దైవప్రవక్త ఆ దృశ్యాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

"ఫాతిమా! ప్రపంచపు కష్టాలను సహనంతో జయించు. పరలోకపు శాశ్వత సంతోషం కొరకు నిరీక్షించు" అన్నారు. దైవం నీకు మంచి ప్రతిఫలం ఇస్తాడు.

ఒకసారి ప్రవక్త (సఅసం) ఫాతిమా ఇంటికి వెళ్లినప్పుడు ద్వారాలకు రంగురంగుల పరదా వేలాడదీసి వుంది. ఫాతిమా చేతుల్లో రెండు వెండి గాజులున్నాయి. దైవప్రవక్త (సఅసం) అవి చూసి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఫాతిమా ఏడ్వసాగారు. అంతలో దైవప్రవక్త (సఅసం) సేవకుడు అబూరాఫే (రజి) వచ్చారు. ఎందుకు ఏడుస్తున్నారని అడిగితే ఫాతిమా జరిగిన విషయం వివరించారు. ప్రవక్త గాజులను, పరదాను అయిష్టపడ్డారన్నారు. ఫాతిమా (రజి) ఆ రెండింటినీ తీసి దైవప్రవక్త (సఅసం) వద్దకు పంపారు. వాటిని దైవమార్గంలో ఇచ్చేశానని చెప్పి పంపారు. ప్రవక్త (సఅసం) చాలా సంతోషించారు. కుమార్తె శుభశ్రేయాల కోసం దైవాన్ని ప్రార్థించారు. వాటిని అమ్మి దాని నగదును సుఫ్ఫా అనుచరుల కొరకు వెచ్చించారు.

ఒకసారి హజ్రత్ అలీ (రజి) ఇంటికి వచ్చి తినేందుకు ఏమైనా ఇవ్వమని అడిగారు. "ఇవ్వాళ మూడవ రోజు ఇంట్లో ఒక్క జొన్న ముక్క కూడా లేదు" అన్నారు. ""ఫాతిమా; అయితే నాతో ఎందుకు

చెప్పలేదు" అనడిగారు అలీ (రజి). "నేను మిమ్మల్ని అడిగి ఎప్పుడూ అగౌరవపరచవద్దని వీడ్కోలు సమయంలో నా తండ్రి హితవు చేశారు" అన్నారు ఫాతిమా.

ఒకసారి బనూ సులైం తెగకు చెందిన ఓ వృద్ధుడు ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (సఅసం) అతనికి మౌలిక ధార్మిక విషయాలు తెలియజేశారు. "నీ దగ్గర ఏమైనా ధనం వుందా?" అనడిగారు. "దైవ సాక్షి! మా వంశంలోని మూడు వేల వ్యక్తులలో అత్యంత పేదవాడు, అగత్యపరుడిని నేనే" అన్నాడు. దైవప్రవక్త (సఅసం) అనుచరులనుద్దేశించి "మీలో ఎవరైనా ఈ దీనుడికి సహాయపడేవారున్నారా?" అనడిగారు. సాద్ బిన్ ఉబాదా (రజి) లేచి "దైవప్రవక్తా! నాదగ్గర ఓ ఒంటె వుంది దాన్ని నేను అతనికిచ్చేస్తాను" అన్నారు. మరి అతనికి ఆశ్రయమిచ్చేవారెవరు? హజ్రత్ అలీ (రజి) లేచి తన శిరోవస్త్రము అతని తలపై పెట్టారు. అతని భోజన వసతులు సమకూర్చేదెవరని అడిగారు. హజ్రత్ సల్మాన్ ఫార్సీ ఆ అరబ్బును తీసుకొని భోజనం కోసం కొన్ని ఇళ్లలో అడిగారు. అక్కడేమీ దొరకకపోవడంతో ఫాతిమా వద్దకు వెళ్లి తలుపుతట్టారు. ఫాతిమా ఎవరని అడిగారు. విషయమంతా వివరించి, "ఓ ప్రవక్త కుమార్తె! ఈ అగత్యపరునికి అన్నపానీయాలు సమకూర్చండి" అని విన్నవించుకున్నారు. ఫాతిమా కన్నీటి పర్యంతమయి "సల్మాన్! దైవసాక్షి! నేడు మేమందరము మూడు రోజుల పస్తులం. పిల్లలిద్దరూ ఆకలితో అలమటిస్తూ నిద్రపోయారు. కాని బిచ్చగాన్ని వట్టి చేతులతో పంపను. ఇది నా దుప్పటి, తీసుకెళ్లి యూదుని వద్దకు వెళ్లి, ఫాతిమా బిన్తె ముహమ్మద్ దుప్పటి పెట్టుకొని ఆ నిరుపేదకు కొంత ధాన్యమివ్వ"మని చెప్పండి. సల్మాన్ అరబ్బుని తీసుకొని యూదుని వద్దకు వెళ్లారు. విషయమంతా వివరించగా

ఆశ్చర్యచకితుడై "సల్మాన్! దైవసాక్షి! ఎవరి గురించయితే తౌరాత్‌లో చెప్పబడిందో వారే వీరు. నేను నీ సాక్షిగా! ఫాతిమా తండ్రిని విశ్వసించాను." తరువాత కొంత ధాన్యం సల్మాన్‌కు ఇచ్చి దుప్పటి ఫాతిమాకు తిరిగి ఇచ్చేశాడు అవి తీసుకెళ్లి ఫాతిమా (రజి)కు ఇచ్చారు. తన చేతులతో ధాన్యం నూరి అరబ్బునికి రొట్టె చేసి పెట్టారు. ఇందులో కొంత పిల్లల కోసం తీసుకోండి అన్నారు. సల్మాన్, " దైవమార్గంలో ఇచ్చిన వస్తువు నా పిల్లలకోసం సమంజసం కాదు" అన్నారు ఫాతిమా. తరువాత దైవప్రవక్త (సఅసం) ఫాతిమా (రజి) వద్దకు వెళ్లి ప్రేమానురాగాలతో ఆమె తల నిమురుతూ ఆకాశం కేసి చూసి ఇలా అన్నారు; "దైవమా! ఫాతిమా! నీ సేవకురాలు ఆమెతో సంతోషించు."

ఒకసారి ఫాతిమా (రజి)ని ఎవరో అడిగారు. 40 ఒంటెల జకాత్ ఎంత అని? దానికి ఆమె మీ కోసమైతే కేవలం ఒక్కటే, నా వద్ద 40 ఒంటెలుంటే అన్నీ దైవమార్గంలో ఇచ్చివెయ్యాలి అన్నారు.

ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం ఒకసారి హజ్రత్ అలీ (రజి) రాత్రంతా ఓ తోటకు నీరివ్వగా, కూలీగా కొన్ని జొన్నలు వచ్చినాయి. ఫాతిమా అందులోని ఓ భాగం తీసి పిండి కొట్టి భోజనం తయారు చేశారు. అంతా వండి వార్చి తినడానికి కూర్చున్నప్పుడు ఓ అగత్యపరుడు నేను ఆకలిగా వున్నానంటూ తలుపుతట్టాడు.

ఫాతిమా ఆ భోజనమంతా అతనికి ఇచ్చేశారు. మిగిలిన జొన్నలు మళ్లీ నూరి అన్నం వండారు. భోజనం తయారవగా ఒక అనాథ వచ్చి బిచ్చమడిగాడు. అదంతా అతనికిచ్చేశారు. తరువాత మళ్లీ వంట చేశారు. అంతలో ఒక ముష్రిక్ ఖైదీ దైవమార్గంలో దానం చెయ్యమంటూ అర్థించాడు. అదంతా అతనికిచ్చేశారు. కుటుంబ సమేతంగా అందరూ ఆరోజు పస్తులున్నారు. దైవానికి వారి ఈ

ఆచరణ ఎంతగా నచ్చిందంటే ఆ ఇంటి వారి గురించి ఈ క్రింది వచనం అవతరించింది.

అల్లాహ్ మీద ప్రేమతో పేదలకూ, అనాధలకూ, ఖైదీలకూ అన్నంపెట్టేవారు. (దహ్ర్ -8)

ఉహుద్ యుద్ధంలో దైవప్రవక్తకు తీవ్రగాయాలయ్యాయి. ప్రవక్త అమరగతినొందారనే వార్త దావానలంలా వ్యాపించింది. మదీనాలో వున్న ఫాతిమా (రజి) ఈ వార్త వినగానే దిగ్భ్రాంతి చెంది ఇతర మహిళలతో పాటు ఉహద్ యుద్ధ మైదానానికి చేరుకున్నారు. దైవవ్రపక్తను క్షేమంగా చూసి ఊపిరిపీల్చుకున్నారు. తండ్రిని ఆ స్థితిలో చూసి చాలా కలవరపడ్డారు. ప్రవక్త గాయాలను పదే పదే కడిగేవారు. కాని నుదుటి గాయాల రక్తం ఆగేది కాదు. చివరికి ఖర్జూరపు చాపకాల్చి గాయానికి కట్టారు. రక్తం ఆగిపోయింది.

ఒకసారి ఫాతిమా వ్యాధిగ్రస్తులయ్యారు. దైవప్రవక్త (సఅసం) తన వృద్ధ సహచరులు ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి)ను వెంట తీసుకొని కుమార్తెను పరామర్శించేందుకు వెళ్ళారు. గడపమీద నిలబడి లోపల ప్రవేశించేందుకు అనుమతి కోరారు. ఫాతిమా రమ్మన్నారు. నాతో పాటు ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కూడా వున్నారన్నారు. అందుకు ఫాతిమా (రజి), "నాన్నగారు, చాటు చేసుకునేందుకు నాదగ్గర ఒక్క అంగీ తప్ప మరే వస్తువు లేదు" అన్నారు. దైవప్రవక్త తన దుప్పటిని లోపలికి విసిరి అమ్మా! దీనితో పరదా చేసుకో అన్నారు. తరువాత దైవప్రవక్త (సఅసం), ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) ఇద్దరూ లోపల ప్రవేశించారు. ఫాతిమా క్షేమ సమాచారాలు అడిగారు. "నాన్నగారు! తీవ్రనొప్పితో బాధపడుతున్నాను. ఆకలితో సొమ్మసిల్లిపడిపోయాను.

ఇంట్లో తినటానికి ఏమీలేదు" అన్నారు. చిట్టితల్లీ సహనం వహించు. నేను కూడా మూడు రోజుల నుంచి పస్తులున్నాను. దైవాన్ని ఏదడిగినా అది ఇచ్చేస్తాడు కానీ నేను ప్రపంచం కన్నా పరలోకానికి ఆధిక్యతనిచ్చాను. తల్లీ! ప్రపంచపు కష్టాలతో నిరాశ చెందకు. నీవు స్వర్గపు మహిళల మహారాణివి.

ఒకసారి ఫాతిమా వ్యాధితో బాధపడుతూనే రాత్రంతా దైవారాధనలో గడిపారు. ఉదయం అలీ (రజి) ఫజ్ర్ నమాజ్ కొరకు మస్జిద్‌కెళ్లారు. ఆమె కూడా నమాజ్ చేసుకొని పిండి కొట్టడం మొదలెట్టారు. అలీ (రజి) నమాజ్ నుండి వచ్చి ఫాతిమా (రజి)ను ఆ స్థితిలో చూసి "ఓ ప్రవక్త కుమార్తె మరీ అంతగా కష్టపడకు. కొంత సేపు విశ్రాంతి తీసుకో లేదంటే మరింత అనారోగ్యం పాలవుతావు" అన్నారు.

"దైవారాధన, మీ విధేయతే వ్యాధికి సరైన చికిత్స. వీటిలో ఏదైనా మరణానికి కారణమైతే అంతకన్నా అదృష్టం మరేముంటుంది" అన్నారు ఫాతిమా.

ఒకసారి ప్రవక్త (సఅసం) ఫాతిమా (రజి)తో ముస్లిం మహిళ విశిష్టతలేమిటి? అనడిగారు.

దైవం; దైవప్రవక్త (సఅసం) పట్ల విధేయత కలిగివుండటం. తన సంతానాన్ని ప్రేమానురాగాలతో ఆదరించి, తన దృష్టిని కిందికి మరల్చి, తన అలంకరణను దాచిపెట్టి, ఇతరులనెవ్వరినీ చూడకుండా, తనపై ఇతరుల దృష్టి పడకుండా వుండటమే ముస్లిం మహిళ లక్షణాలు అన్నారు ఫాతిమా (రజి).

దైవప్రవక్త (సఅసం) ఫాతిమా (రజి)ను అమితంగా ప్రేమించే వారు. సహీ బుఖారీ ఉల్లేఖనం ప్రకారం ఒకసారి హజ్రత్ అలీ (రజి)

గౌరా బిన్తె అబూజహల్‌తో వివాహమాడదలిచారు. ఫాతిమా చాలా బాధపడ్డారు. దైవప్రవక్త (సఅసం) ఆమె వద్దకు వచ్చినప్పుడు పాతిమా "దైవప్రవక్తా! అలీ (రజి) నాకు సవతిని తీసుకురావాలనుకుంటు న్నారు" అన్నారు. అది విని ప్రవక్త మనసు కూడా గాయపడింది అంటు గౌరా సంరక్షకులు కూడా ప్రవక్త (సఅసం)లో నికాహ్ అనుమతి కోరేందుకు వచ్చారు. ప్రవక్త మస్జిద్‌లోకి వెళ్లి వేదిక పైకెక్కి ఇలా అన్నారు.

హిషామ్ కుటుంబీకులు తన కుమార్తె నికాహ్ అలీ (రజి)తో జరిపేందుకు నన్ను అనుమతి కోరుతున్నారు. కాని నేను ససేమిరా అనుమతించను. అయితే అలీ (రజి) నా కుమార్తెకు విడాకులిచ్చి ఇతర స్త్రీని వివాహమాడవచ్చు, ఫాతిమా! నా శరీరంలోని ఓ భాగం ఆమెను ఎవరైతే బాధపెట్టారో వారు నన్ను బాధించినట్లే. నేను హలాల్‌ను హరామ్‌గా, హరామ్‌ను హలాల్‌గా చేయదలచలేదు. కాని దైవసాక్షి! దైవప్రవక్త కుమార్తె, దైవశత్రువు కుమార్తె ఇద్దరూ ఒకచోట ఇమడలేరు. అంతటితో హజ్రత్ అలీ (రజి) నికాహ్ ఉద్దేశాన్ని విరమించుకున్నారు. ఆయన(రజి) జీవితంలోనే మరో వివాహం చేసుకోవాలనే యోచన రానివ్వలేదు.

దైవప్రవక్త (సఅసం) తన కుమార్తె పట్లనే కాకుండా అల్లుడు, మనవళ్లతో కూడా ప్రేమాభిమానాలు కలిగివుండేవారు. హజ్రత్ అలీ (రజి)తో "అలీ! నీవు ప్రపంచంలో పరలోకంలో నా సోదరుడివి. ఫాతిమా పిల్లలు ఇమాం హసన్, హుసైన్ (రజి)ను తన ముద్దుల మనవళ్ళు" అనేవారు. ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో వారిని ముద్దా డుతూ తన బుజాలపై ఎక్కించుకొని తిరిగేవారు.

దైవప్రవక్త దివంగతులవడానికి కొన్ని రోజులు పూర్వం ఫాతిమా (రజి) ప్రవక్త (సఅసం)ను పరామర్శించేందుకు ఆయిషా గదికి వచ్చారు. ప్రవక్త ఎంతో ప్రేమతో తన వద్ద కూర్చోబెట్టు కున్నారు. ఆమె చెవిలో మెల్లిగా ఏదోమాట చెప్పారు. అది విని ఆమె ఏడ్వసాగారు. తరువాత చెవిలో మళ్లీ మరోమాట చెప్పారు. అది విని ఆమె నవ్వసాగారు. వెళ్లేటప్పుడు "ఫాతిమా! నువ్వు నవ్వటం, ఏడ్వటంలో రహస్యం ఏమిట"ని అడిగారు. ఆయిషా దైవప్రవక్త (సఅసం) గోప్యంగా వుంచిన దానిని నేను బహిర్గతం చేయను అన్నారు ఫాతిమా. దైవప్రవక్త (సఅసం) పరమపదించిన తరువాత ఓ రోజు ఆయిషా, ఫాతిమా (రజి)తో ఆ రోజు జరిగిన విషయం గురించి వివరణ అడిగారు. ఫాతిమా (రజి) దానికి, "మొదటి సారి, ఎప్పుడూ జిబ్రయీల్ అమీన్ ఏడాదికి ఒకసారి దివ్యఖుర్ఆన్ వినిపించేవారు. ఈ ఏడాది రెండుసార్లు వినిపించారు. దీనితో నా మరణ సమయం ఆసన్నమైందని భావిస్తున్నా"నన్నారు దైవప్రవక్త. దానికి నేను ఏడ్చాను. తరువాత "నా కుటుంబీకులలో అందరికన్నా ముందు నువ్వే నాకు చేరువవవుతావని, నీవు స్వర్గపు మహిళల మహారాణివవుతావన్నారు." ఆ మాటతో సంతోషించి నవ్వాను అన్నారు.

మరణానికి ముందు ప్రవక్త పదే పదే స్పృహ కోల్పోయేవారు. దానితో ఫాతిమా మనస్సు చలించి పోయేది.

ప్రవక్త మరణంతో ఫాతిమా (రజి)పై దుఖం కట్టలు తెంచుకుంది. దేవా! ఫాతిమా (రజి) ఆత్మను ముహమ్మద్ వద్దకు చేర్చు. నాకు ప్రవక్త (సఅసం) దర్శనం చేయించు. ప్రళయదినాన ముహ మ్మద్ (సఅసం) సిఫారసుకు అర్హత కల్పించు అని వేడుకునేవారు.

ప్రవక్త అంత్యక్రియలు పూర్తయిన తరువాత సహచరులు సంతాపం ప్రకటించేందుకు ఆమె వద్దకు వచ్చేవారు. కాని ఆమెకు ఏమాత్రం సంతృప్తి కలిగేది కాదు. దైవప్రవక్త మరణించిన తరువాత ఫాతిమా (రజి)ను నవ్వినట్లు ఎవరూ చూడలేదు.

దైవప్రవక్త (సఅసం) పరమపదించిన తరువాత ఆస్తి వివాదం తలెత్తింది. ఫదక్ అనే ఓ పొలమును దైవప్రవక్త (సఅసం) కొందరికి కౌలుపై రాబడిలో సగభాగం వారు తీసుకొని సగభాగం దైవప్రవక్త (సఅసం)కు ఇచ్చేటట్లు షరతుపై ఇచ్చారు. దైవప్రవక్త (సఅసం) తన భాగంలో నుంచి కొంత కుటుంబీకుల కోసం ఖర్చుపెట్టేవారు. మిగిలి నదంతా ప్రయాణికులు, అగత్యపరులకు వెచ్చించేవారు. ఫాతిమా (రజి)కు కొందరు ఫిదక్ దైవప్రవక్త స్వంత పొలమని, దాని వారసు రాలివి నీవేనని చెప్పారు. దాంతో ఆమె అబూబకర్ వద్ద ఫిదక్ ఆస్తి కోసం దావా వేశారు.

ఫాతిమా! దైవప్రవక్త కుటుంబీకుల్ని నేను నా కుటుంబీకుల కన్నా అమితంగా ప్రేమిస్తాను. ఇబ్బందేమంటే ప్రవక్తలు వదిలిన ఆస్తి సదఖాగా భావించబడుతుంది. అందులో వారసత్వం సమస్య తలెత్తదు కనుక ఆస్తి పంపకం చేయలేను, అయితే ప్రవక్త హయాంలో వారి కుటుంబీకులు పొందిన ఆదాయం ఇప్పుడూ పొందవచ్చు అని జవాబిచ్చారు. అబూబకర్ (రజి) ఆ మాటలతో ఫాతిమా చాలా విస్మయం చెందారు. అబూబకర్‌తో విముఖతగా వున్నారు. మరణించే దాకా ఆయనతో, మాట్లాడలేదు.

ఒక ఉల్లేఖనం ప్రకారం ఆమె వ్యాధికి గురైనప్పుడు అబూబకర్ (రజి) పరామర్శించేందుకు వచ్చారు. ఫాతిమా తన ఇంట్లోకి వచ్చేం దుకు అనుమతించారు. తన కోపాన్ని దిగమింగుకున్నారు.

దైవప్రవక్త దివంగతులైన తరువాత ఫాతిమా (రజి) వ్యధాభరితంగా ఉదాసీనంగా ఉండసాగారు. ప్రవక్త మరణానికి 6 నెలల తర్వాత రమజాన్ నెల హిజ్రీ 11వ శకంలో ఆమె కూడా స్వర్గస్తులయ్యారు. తన మరణానికి ముందు అస్మా బిన్తె ఉమైస్ (రజి)ను పిలిచారు. నా జనాజా తీసుకెళ్లేటప్పుడు, అంత్యక్రియలు జరిగేటప్పుడు పూర్తి పరదాను పాటించాలని, గుసుల్ చేయించేటప్పుడు నా భర్త తప్ప వేరేవారి సహాయం తీసుకోకూడదని, అంత్యక్రియలప్పుడు ఎక్కువ జనసందోహం ఉండకుండా చూడమని చెప్పారు. కనుక ఫాతిమా (రజి) పరమపదించిన తరువాత ఆమె జనాజా అదే విధంగా తీసుకెళ్ళారు. అతికొద్ది మందికి మాత్రమే జనాజాలో పాల్గొనే అవకాశం లభించింది. ఎందుకంటే రాత్రిపూట మృతి చెందారు. హజ్రత్ అలీ (రజి) ఆమె వీలునామా ప్రకారం రాత్రిపూటే అంత్యక్రియలు పూర్తి చేశారు. హజ్రత్ అబ్బాస్ (రజి) జనాజా నమాజ్ చేయించారు. అలీ (రజి) హజ్రత్ ఫజల్ బిన్ అబ్బాస్ సమాధిలో వుంచారు. దారె అఖీల్‌కు ఓ మూలన ఖననం చేశారు.

హజ్రత్ ఫాతిమా (రజి)కు ఆరుగురు సంతానం కలిగారు. హజ్రత్ ఇమాం హసన్, హుసైన్ (రజి), హజ్రత్ ముహ్సిన్ (రజి), హజ్రత్ ఉమ్మె కుల్‌సుమ్ (రజి), రుఖియా (రజి), జైనబ్ (రజి). ముహ్సిన్, రుఖియాలు బాల్యంలోనే చనిపోయారు. హజ్రత్ ఇమాం హసన్, హుసైన్, ఉమ్మె కుల్‌సుమ్, జైనబ్ (రజి ఇస్లామీయ చరిత్రలో పేరుగాంచిన ప్రముఖ వ్యక్తిత్వాలుగా ప్రసిద్ధి చెందారు. దైవప్రవక్త వంశం ఫాతిమా (రజి) ద్వారానే మిగిలింది.

చరిత్రకారులు ఫాతిమా (రజి) గొప్ప విశిష్టతలెన్నో వర్ణించారు.